మిరపకు తెగుళ్ల బెడద

ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో ఎక్కువ మంది రైతులు మిరప పంటను సాగు చేశారు. నాట్లు వేసిన తర్వాత అకాల వర్షాలు కురవడంతో మొక్కలు దెబ్బతిన్నాయి. రైతు వెనకడుగు వేయకుండా మళ్లీ మిరప నారు నాటుకుని సంరక్షించుకున్నాడు. అప్పటికే అదును దాటి సమయంలో మించిపోవడంతో తెగుళ్లు విజృంభించాయి. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

- విజృంభించిన తెగుళ్లు
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



అర్మేనిపాడులో సాగులో ఉన్న మిరప పంట, (ఇన్‌సెట్) తెగుళ్లకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

ఓజిలి : మండలంలోని మానమాల, కురుగొండ, చిలమానుచేను, పెదపరియ, ముమ్మాయపాళెం, మాచవరం, తిరుమలపూడి తదితర గ్రామాల్లోని రైతులు 500 ఎకరాలకు పైగా మిరప పంటను సాగు చేశారు. మొలక దశ నుంచే తెగుళ్లు అధికంగా ఆశించాయి. ముఖ్యంగా బూడిద, పండ్లాకు, ఎండు కొమ్మ, వైరస్ తెగుళ్లతో పంట దెబ్బతింటోంది. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆకులపైన బూడిదవంటి పొడితో కప్పబడి ఉండే తెగులు సోకింది. దీంతో ఆకులు రాలిపోయి చెట్లు ఎండిపోయే స్థితికి చేరాయి. ఉన్న అరకొర చెట్లలో ఆకులపై ఈనెలు పసుపు రంగులోకి మారి కాయలు గిటకబారి తెల్లగా మారిపోయాయి. ఎండుకొమ్మ తెగులు వ్యాపించి మొలకలు మొదటి దశలో ఎండిపోయి చనిపోతుండడంతో పంటలో మొక్కల శాతం తగ్గిపోయి రైతులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ముడత ఎక్కువగా వచ్చి ఆకులు ముడుచుకుపోయి పురుగులు ఆశిస్తున్నాయి. అలాగే వైరస్ తెగులుతో ఆకులు ముడుచుకుపోయి చెట్లు చనిపోతున్నాయి. తెగుళ్ల నివారణకు రైతులు ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. గతేడాది కూడా పంట పూర్తిగా దెబ్బతినడంతో మిరప రైతు కోలేకపోయాడు. ఈ ఏడాది కూడా పంటలు దెబ్బతినడంతో అప్పులు ఎలా కట్టుకోవాలో తెలియక రైతులు లబోదిబోమంటున్నారు.

క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



మామిడి చెట్లను పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

సైదాపురం: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌తో కలిసి లింగనపాళెంలోని మామిడి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మామిడి పూత పూసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూత, మొగ్గ దశలో మోనోక్రోటాపాస్ 1.6 మిలీ, మ్యాంకోజెబెట్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తద్వారా తేనె మంచు పురుగులు, పక్షికన్ను, బూడిద, మసి తెగుళ్లను నివారించవచ్చన్నారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు



నిరసన తెలుపుతున్న చింతా మోహన్

నాయుడుపేట టౌన్ : సీఎం చంద్రబాబు ఇచ్చేవన్నీ మోసపూరిత హామీలేనని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. ఆయన సోమవారం నాయుడుపేట పాత బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబునాయుడు విఫలమయ్యారని దుయ్యబట్టారు. దుగరాజపట్నం పోర్టును అడ్డుకుంటూ కుటిల రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణం చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు చందనమూడి శివ, గాడి వెంకటయ్య, కేవీ కృష్ణయ్య పాల్గొన్నారు.

పురుగు మందులు లేని కూరగాయలు వాడాలి

చిట్టమూరు : పురుగు మందులు, రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూర గాయలనే వాడాలని మాస్టర్ ట్రైనర్ బాబా సాహెబ్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్‌లో విక్రయాలు జరిపారు. ఆయన మాట్లాడుతూ రసాయనాలు, పురుగు మందులు వాడకుండా పశువుల ఎరు వు, వేపాకుల కషాయంతో కూరగాయలు పండించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సాధికార సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు, మధు, షాజహాన్, గోపాలయ్య, రాంబాబు పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్

కోట: రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించేందుకు వీలుగా 35 ఏళ్లు దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని వల్లిపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి జె.దినేష్ సూచించారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం కోట మండలం కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు హరిత, పద్మావతి, ఏఎన్‌ఎంలు చెంగమ్మ, మస్తానమ్మ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ



తహసీల్దార్ సతీష్ కుమార్

చిట్టమూరు : మండల తహసీల్దార్‌గా కాయల సతీష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీ విజయలక్ష్మి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. సెలవులో ఉన్న సతీష్ కుమార్ నూతనంగా చిట్టమూరు తహసీల్దార్‌గా వచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయనను డీటీ విజయలక్ష్మి, ఆర్ఐ నిరంజన్, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

పేదలకు భూములు ఇవ్వాలి

సైదాపురం: ఊటుకూరు సమీపంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ లీజు రద్దయిన నేపథ్యంలో ఆ భూములను పేదలకు పంపిణీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పేదలతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో సర్వే నంబర్ 3, 20, 25-1, తురిమెర్లలో 460, 461లో మొత్తం 178 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి మైనింగ్ లీజుకు ఇచ్చారని తెలిపారు. 2023 ఆగస్టులోనే మైనింగ్ లీజు గడువు ముగిసిందన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఆ భూములను పేదలకు ఇస్తే సాగు చేసుకుని జీవనం సాగిస్తారని వెల్లడించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



యువత పోరు కరపత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఈ నెల 12న నెల్లూరులో యువత పోరు
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్ : హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఆయన సోమవారం సూళ్లూరుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని దుయ్యబట్టారు. తల్లికి వందనం, విద్యా దీవెన, వసతి దీవెనకు కూడా మంగళం పాడాలని విమర్శించారు. అధికారం కోసం మోసపూరిత హామీలు ఇవ్వడం చంద్రబాబుకు రివాజుగా మారిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయా లని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ బుధవారం నెల్లూరులోని వీఆర్‌సీ మైదానంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, జెట్టి వేణు, అలవల సురేష్, సుబ్రమణ్యంరెడ్డి, అల్లూరు రమేష్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి, బాబురెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, అయితా శ్రీధర్, చిలక యుగంధర్ పాల్గొన్నారు.



వెంకటగిరి : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

వెంకటగిరి (సైదాపురం) : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేద్దామని ఆ పార్టీ వెంకటగిరి పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎం ఏ నారాయణ, ఆరి శంకరయ్య, సుబ్బా రావు పిలుపు నిచ్చారు. వారు సోమవారం నేదురుమల్లి నివాసంలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న దగాను ఎండగట్టేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కె రాజారెడ్డి, పేచీరాజ్, తాజుద్దీన్, సురేష్ పాల్గొన్నారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

చిల్లకూరు : పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్టు నిర్వాహకుడు పోతుగుంట మల్లికార్జున్ ఆకాంక్షించారు. చిల్లకూరులోని డానియేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో సోమవారం ట్రస్టు ద్వారా పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ డానియల్ చిల్డ్రన్ హోమ్‌లో వసతి పొందుతున్న నిరుపేద విద్యార్థులకు చేయూత ఇవ్వాలనే ప్యాడ్లు, పెన్నులు, జామింట్రీ బాక్సులు అందజేసినట్టు తెలిపారు. 85 శాతానికి పైగా మార్కులు సాధించిన వారికి నగదు బహుమతి అందజేస్తామన్నారు. బిజేంద్ర కుమార్, అరుణ్‌బాబు, బాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ



నాయుడుపేట టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు డీ.ప్రభాకర్ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టినట్లు గూడూరు డిప్యూటీ డీఈఓ సనత్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యాయుడు ఈ నెల 4 తేదీన పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిని ప్రైవేటు తరగతుల పేరిట తన ఇంటివద్దకు పిలిపించుకోవడం, అలాగే పాఠశాల ఉపాధ్యాయిని పట్ల సూటిపోటి మాటలు మాట్లాడడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై డెప్యూటీ డీఈఓ విచారణ చేపట్టారు. ఈ విచారణలో సీడీపీఓ ఉమామహేశ్వరి, జిల్లా చైల్డ్ పోటెక్షన్ యూనిట్ అధికారిణి దేవాయాని, ఎస్ఐ ఆదీలక్ష్మి, ఎంఈఓ శాంతి ఉన్నారు.

పాము కాటుతో యువకుడికి అస్వస్థత

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఒక పాము కలకలం సృష్టించింది. తమీమ్ అనే యువకుడిని కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న చెట్టు వద్ద పాము ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పట్టుకునేందుకు ప్రయత్నించడంతో అది వైర్లపైకి వెళ్లి అక్కడి నుంచి కింద పడింది. అటుగా వస్తున్న తమీమ్ అనే యువకుడి కాలుకు చుట్టుకుని కాటు వేసింది. స్థానికులు దాన్ని పక్కకు లాగి కొట్టి చంపేశారు. పాము కాటుతో అస్వస్థతకు గురైన తమీమ్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీస్ స్టేషన్ వెనుక పాత బైక్‌లు ఉంచడంతో పాములు చేరుతున్నాయని, ఇళ్లలోకి సైతం వస్తున్నాయని స్థానికులు వాపోయారు.

అంగన్‌వాడీ కార్యకర్తల హౌస్ అరెస్టు దారుణం

నాయుడుపేట టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపేందుకు విజయవాడకు వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లను హౌస్ అరెస్టు చేయడం దారుణమని ప్రాజెక్టు కార్యదర్శి ఎస్. శ్యామలమ్మ ఖండించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల అంగన్‌వాడీ కార్యాకర్తలు, హెల్పర్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు ముకుంద, పుష్పవతి, కళావతి, నాగమ్మ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

వాకాడు : మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళా సాధికారితపై వివరించారు. బాలిరెడ్డిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దివిత ప్రథమ బహుమతి, ఆర్ సుహారిక(దుగ్గరాజపట్నం) ద్వితీయ, ఎం చానిత్య (వాలమేడు) తృతీయ బహుమతి అందుకున్నారు. ఎంఈవో నసీంఅలీ, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా



తడ: జాతీయ రహదారిపై ధాన్యం లోడ్తుతో వెళుతున్న ట్రాక్టర్ కొండూరు గ్రామం వద్ద సోమవారం బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో వెనుకనే లారీ వస్తోంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ బోల్తా కొట్టిన అనంతరం ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్, ధాన్యం బస్తాలను రోడ్డుపై నుంచి తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

రేపు రైతులకు అవగాహన

దక్కిలి : వెంకటగిరి పెరియవరం సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో నిమ్మ, మామిడి రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని రైతులు పాల్గొనాలని సూచించారు.

సైదాపురంలో పారిశుద్ధ్య పనులు

సైదాపురం: సైదాపురం పంచాయతీలో సోమవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో బావుల్లో క్లోరినేషన్ పనులతో పాటు వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేస్తున్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో తరలించారు.


క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కల్పించాలి

కోట : గ్రామాల్లో చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ప్రజలకు ముందుగా సమాచారం ఇవ్వడంతోపాటు అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. క్యాన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల గురించి గ్రామాల్లో చాలామందికి తెలియడం లేదన్నారు. కొక్కుపాడులో డాక్టర్ల బృందం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా దీనిపై ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఎవరికీ సమాచారం ఇవ్వలేదన్నారు. సంబంధిత అధికారులు ముందుగా సమాచారం ఇచ్చి పరీక్షలు నిర్వహించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

వెంకటగిరి రూరల్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. ఆయన సోమవారం వెంకటగిరిలోని ధర్మాపురం, పుల్లయబడి, తోలిమిట్ట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో కూరగాయలు నాసిరకంగా ఉండడాన్ని గుర్తించి ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం 12, 23వ వార్డుల పరిధిలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను పరిశీలించి మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరారు. వారు సోమవారం కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మలీల మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం అణచివేసే ధోరణిని అవలంభిస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, గ్రాడ్యూటీ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయిలు, టీఏ బిల్లులు ఇవ్వాలని తెలిపారు. పద్మమ్మ, మమత, కిష్టమ్మ పాల్గొన్నారు.

పరిహారం తక్కువగా ఇవ్వడంపై అభ్యంతరం

చిల్లకూరు : క్రిస్ సిటీకి సేకరించిన భూములకు తక్కువ పరిహారం ఇవ్వడంపై తమ్మినపట్నం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో పలువురికి అసైన్డ్, డీకేటీ భూములు పంపిణీ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. ఈ భూముల్లో కొంత భాగం 2021లో అధికారులు సేకరించారని తెలిపారు. ఎకరాకు రూ.15 లక్షల వరకు పరిహారం ఇచ్చారని పేర్కొన్నారు. నేడు క్రిస్ సిటీకి సేకరించిన భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలున్నా సాగు కింద ఎకరాకు రూ.8 లక్షలు చెల్లించేలా జాబితాను సిద్ధం చేయడం ఏమిటని నిలదీశారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13 తర్వాత అభ్యంతరాలపై విచారించేందుకు గ్రామాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తాయని పేర్కొన్నారు. వారికి అభ్యంతరాలు తెలపాలని వెల్లడించారు. పరిహారం విషయంపై పూర్తి నిర్ణయం జిల్లా కలెక్టర్‌దేనని, ఆయన దృష్టికి సమస్యను తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో తమ్మినపట్నం, లింగవరం గ్రామాల సర్పంచులు నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, నావిన సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన తమ్మినపట్నం గ్రామస్తులు

అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని జాతీయ రహదారి కూడళ్లలో అండర్‌పాస్ బ్రిడ్జిలు, సర్వీసు రోడ్లు నిర్మించాలన్న తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరిక మేరకు ఎన్‌హెచ్ అధికారులు సోమవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. విన్నమాల, నరసారెడ్డి కండ్రిగ, అయ్యప్పరెడ్డి పాళెం, పండ్లూరు తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి కూడలి ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు మృతిచెందారు. ఈ క్రమంలో అండర్ పాస్ బ్రిడ్జిల ఆవశ్యకతను స్థానికులతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డి ఎంపీకి వివరించారు. ఆయన బ్రిడ్జీలు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ఎన్‌హెచ్ కన్సల్టెన్సీ అధికారులు సోమవారం నాయుడుపేట సమీపంలోని పలు గ్రామాల సమీపంలో వెళుతున్న జాతీయ రహదారిని పరిశీలించారు. నరసారెడ్డి కండ్రిగ, అయ్యప్పరెడ్డి పాళెం, పండ్లూరు గ్రామాల సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు వారికి విన్నవించారు. పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.



బ్రిడ్జిలు నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

'ఉపాధి' కింద సేద్యపు గుంతలు

చిల్లకూరు : ఉపాధి హామీ పథకం కింద రైతులకు సేద్యపు నీటి గుంతలు తవ్విస్తామని ఏపీవో గిరిబాబు తెలిపారు. ఆయన సోమవారం ఉడతావారి పాళెంలో జరుగుతున్న సేద్యపు నీటి గుంతల పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 30 సేద్యపు నీటి గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారని తెలిపారు. అందులో ఇప్పటికే 16 పూర్తి చేశామన్నారు. మిగిలిన సేద్యపు నీటి గుంతలను కూడా త్వరలోనే పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని నెరవేరుస్తామన్నారు. సేద్యపు నీటి గంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండి మెట్ట పంటల సాగుకు ఉపయోగపడుతుందని వివరించారు. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని చెప్పారు. ఒక సేద్యపు నీటి గుంత తవ్వడానికి కూలీలకు రూ.6 వేలు చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సేద్యపు నీటి గుంతల పనులను పరిశీలిస్తున్న ఏపీవో గిరిబాబు

ఏకగ్రీవంగా కలువాయి, దాచూరు చేపల సొసైటీ ఎన్నికలు

కలువాయి: మండలంలోని కలువాయి చెరువు, దాచూరు మత్స్యసహకార సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవమయ్యాయి. మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రెండు సొసైటీలకు ఏక పక్షంగా తొమ్మిది మంది మాత్రమే నామినేషన్లు దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. వారి నుంచి సొసైటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కారదర్శులను ఎన్నుకున్నారు. ఎఫ్‌డీవో సురేష్‌బాబు, గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు సోమవారం జన విజ్ఞాన వేదిక సభ్యులు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా బేగం తెలిపారు. ఆస్పత్రిలో సోమవా రం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ క్రమంలో వారికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ షరీనా మాట్లాడుతూ రక్తం తక్కువగా ఉంటే కాన్పు కష్టమవుతుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలని, వారికి ప్రభుత్వం రూ.5 వేలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో దాత నందిమండలం బాలక్రిష్ణంరాజు, జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సభ్యులు నాగరాజు, ప్రభాకర్, ఆనంద్, ఇబ్రహీం, చెంచునారాయణ, సుబ్బారావు, మస్తా న్, జగదీష్, పవన్, సాయి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యులు, జేవీవీ సభ్యులు

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సైదాపురం : స్థానిక ఎమ్మార్సీలో సోమవారం ఎంఈవో దయాకర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి వర్ధంతిని జరుపుకున్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏపీ పూలే టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు అన్నం శ్రీనివాసులు, తమ్మారవి, జి రత్నం, సతీష్ కుమార్, జనార్దన్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : మహిళల విద్య కోసం పరితపించిన మహోన్నతురాలు సావిత్రి బాయిపూలే అని పలువురు నాయకులు కొనియాడారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండు వద్ద సావిత్రి బాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్, వినుకొండ ధనుంజయ, శివ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల మృతికి సంతాపం

సైదాపురం: ప్రముఖ సంగీత విద్వాంసుడు, స్వరకర్త, టీటీడీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి తీరని లోటని ఎస్వీబీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. ఆయన బాలకృష్ణప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా బాలకృష్ణ ప్రసాద్ అందించిన సేవలు మరవలేవన్నారు. ఆయనతో కలిసి తాను కూడా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేసుకున్నారు.

భూసమస్యలను పరిష్కరించాలి

ఓజిలి: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పద్మా వతి వీఆర్వోలను ఆదేశించారు. ఆమె సోమవారం వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డీటీ మధుసూదన్‌రాజు, ఆర్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థుల డిబార్

నాయుడుపేట టౌన్ : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన పరీక్షలో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన వర్మ తెలిపారు.